# జూనియర్ క్రికెట్‌లో కీలక మార్పులు

**బోన్ టెస్టు ఆధారంగా వయసు నిర్ధారణ**



న్యూఢిల్లీ: జూనియర్ క్రికెట్‌లో కీలక మార్పులకు బీసీసీఐ సిద్ధమైంది. పలువురు క్రికెటర్లు నకిలీ వయసు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తూ వయసు విభాగపు లీగ్‌లో ఆడుతున్న నేపథ్యాలను దృష్టిలో పెట్టుకుని బోర్డు పలు నిర్దిష్టమైన మార్పులు చేసింది. ఇందులో ఆయా వయసు విభాగాల్లో పోటీపడే యువ క్రికెటర్లకు 'బోన్ టెస్టు' ఆధారంగా ఆడేందుకు అనుమతి ఇచ్చేందుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతమున్న ఎముకల సాంద్రతను కొలిచే టీడబ్ల్యూ3 పద్ధతికి తోడు ఏ+1 విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా వచ్చే సీజన్‌లో సదరు ప్లేయర్ ఆడేందుకు కావాల్సిన ప్రమాణాలను స్పష్టంగా పేర్కొంది. సైంటిఫిక్ పద్ధతిలో కాకుండా ఏ ఒక్క ప్లేయర్ మ్యాథమెటికల్‌గా వయసు నిర్ధారణ అర్హత కోల్పోయే అవకాశముండదని బోర్డు తెలిపింది. బాలుర అండర్-16 విభాగంలో బోన్ ఏజ్ కటాఫ్‌ను 16.5 సంవత్సరాలుగా, బాలికల అండర్-15కు 15 ఏండ్లుగా నిర్ధారించింది. దీని ప్రకారం ప్లేయర్ బోన్ ఏజ్ 16.4 లేదా అంతకంటే తక్కువ ఉంటే మాత్రమే అతను తర్వాత సీజన్‌లో ఆడేందుకు అర్హుడు. బాలికల్లో ఇది 14.9కు పరిమితం చేసినట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఉదాహరణకు బాలుర అండర్-16లో ఒక ప్లేయర్ 2025-26 సీజన్‌లో ప్లేయర్ బోన్ టెస్టుకు హాజరై అతని ఫలితం 15.4 ఏండ్లు ఉంటే అతను వచ్చే సీజన్‌లో మళ్లీ పరీక్షకు హాజరు కానవసరం లేదు. ఏ+1 పద్ధతి ప్రకారం అతని వయసు 16.4 అవుతుందని కావున నిబంధనల ప్రకారం అర్హుడు అవుతాడు. ఒక వేళ ప్లేయర్ బోన్ ఏజ్ 15.5 ఏండ్లు ఉంటే అతను వచ్చే సీజన్‌లో ఆడేందుకు అర్హత కోల్పోతాడని బోర్డు స్పష్టం చేసింది.

# అక్టోబర్ 5న దాయాదుల పోరు

**మహిళల వన్డే ప్రపంచకప్ పూర్తి షెడ్యూల్ విడుదల ● సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న భారత్, శ్రీలంక**



దుబాయ్: ప్రతిష్ఠాత్మక మహిళల వన్డే ప్రపంచకప్‌నకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సోమవారం విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీలో 8 జట్లు పాల్గొననున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30న భారత్, శ్రీలంక మధ్య బెంగళూరు వేదికగా జరుగబోయే మ్యాచ్‌తో ఆరంభమయ్యే 13వ వన్డే ప్రపంచకప్.. నవంబర్ 02న జరిగే ఫైనల్‌తో ముగియనుంది. అక్టోబర్ 29న తొలి సెమీఫైనల్ గువహతి (ఒకవేళ పాకిస్థాన్ సెమీస్‌కు అర్హత సాధిస్తే కొలంబోలో) జరుగనుండగా అదే నెల 30న బెంగళూరులో రెండో సెమీస్ జరుగుతుంది. పాకిస్థాన్ గనక ఫైనల్ చేరితే ఫైనల్ పోరుకు కొలంబోలోని ప్రేమదాస స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. భారత్‌లోని బెంగళూరు, గువహతి, వైజాగ్, ఇండోర్‌లో మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా శ్రీలంకలోని కొలంబో ఏకంగా 11 లీగ్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. ఇక టోర్నీకే హైలైట్‌గా నిలిచే భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే దాయాదుల పోరు అక్టోబర్ 05న కొలంబో వేదికగా నిర్వహించనున్నారు. ఇరుదేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌కు వచ్చేందుకు పాక్ నిరాకరించడంతో ఆ జట్టు ఆడాల్సిన మ్యాచ్‌లను హైబ్రిడ్ పద్ధతిన కొలంబోలో ఆడించనున్నారు. 2013 తర్వాత భారత్ నిర్వహించనున్న ఐసీసీ ట్రోఫీ (మహిళల క్రికెట్‌లో) అవడంతో దీనిని విజయవంతం చేసేందుకు బీసీసీఐ పూర్తి ప్రణాళికలు సిద్ధం చేసింది.

**8 జట్లు.. 28 లీగ్ మ్యాచ్‌లు**

డిఫెండింగ్ చాంపియన్స్ ఆస్ట్రేలియాతో పాటు గత ఎడిషన్ రన్నరప్ ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక నేరుగా అర్హత సాధించగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు క్వాలిఫయర్స్ ద్వారా ఈ మెగా టోర్నీలో ఎంట్రీ ఇచ్చాయి. 28 లీగ్ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్న ఈ టోర్నీలో ఒక్కో జట్టు.. మిగిలిన జట్లతో తలా ఒక్క మ్యాచ్ ఆడనుంది. లీగ్ దశలో టాప్-4లో నిలిచిన జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ఆస్ట్రేలియా.. అక్టోబర్ 01న ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో న్యూజిలాండ్ మ్యాచ్‌తో టైటిల్ వేటను ప్రారంభించనుంది.

**భారత్ షెడ్యూల్**

| తేదీ | ప్రత్యర్థి | వేదిక |
|---|---|---|
| సెప్టెంబర్ 30 | శ్రీలంక | బెంగళూరు |
| అక్టోబర్ 05 | పాకిస్థాన్ | కొలంబో |
| అక్టోబర్ 09 | దక్షిణాఫ్రికా | విశాఖపట్నం |
| అక్టోబర్ 12 | ఆస్ట్రేలియా | విశాఖపట్నం |
| అక్టోబర్ 19 | ఇంగ్లండ్ | ఇండోర్ |
| అక్టోబర్ 23 | న్యూజిలాండ్ | గువహతి |
| అక్టోబర్ 26 | బంగ్లాదేశ్ | బెంగళూరు |

# టీమ్ ఎమ్‌జీడీ1కు ఐదో స్థానం

● **వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్**



లండన్: ప్రతిష్ఠాత్మక వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లతో కూడిన టీమ్ ఎమ్‌జీడీ1 ఐదో స్థానంలో నిలిచింది. ఇదే టోర్నీలో ర్యాపిడ్ టైటిల్ సొంతం చేసుకున్న టీమ్ ఎమ్‌జీడీ1.. బ్లిట్జ్ విభాగంలో ఒకింత నిరాశపరిచింది. సోమవారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన నాకౌట్ పోరులో టీమ్ ఎమ్‌జీడీ1.. 1-3 తేడాతో హెక్సామైండ్ చెస్ టీమ్ చేతిలో ఓటమిపాలైంది. ఇరిగేసి అర్జున్, పెంటెల హరికృష్ణ, డేవిడ్ గుజారో, ప్రణవ్, లియోన్ లూక్ మెండోకా, స్ట్రావోలా, అథర్వ తైదేతో కూడిన టీమ్ ఎమ్‌జీడీ1.. లెవనో అరోనియన్, విదిత్ గుజరాతి లాంటి ప్లేయర్లను హెక్సామైండ్ కల్గి ఉన్నది. అయితే ఉత్కంఠగా సాగిన పోరులో హెక్సామైండ్ ప్లేయర్ అనీశ్ గిరి చేతిలో హరికృష్ణ ఓడిపోయాడు. దీంతో ఐదో స్థానం కోసం ప్లేఆఫ్స్ పోరులో టీమ్ ఎమ్‌జీడీ1...4-2తో విశ్వనాథన్ ఆనంద్‌కు చెందిన ఫ్రీడమ్ టీమ్‌పై గెలిచింది. రానున్న భవిష్యత్‌లో చెస్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఇలాంటి టోర్నీలు నిర్వహిస్తామని ప్రపంచ చెస్ ఫెడరేషన్(ఫిడే) ఉపాధ్యక్షుడు ఆనంద్ పేర్కొన్నాడు.

# భారత క్రికెటర్ రిటైర్మెంట్ ఇవ్వమన్నాడు

**కరణ్ నాయర్ సంచలన వ్యాఖ్యలు**



లండన్: ఓ భారత క్రికెటర్ తనను రిటైర్ కావాలని సూచించినట్లు కరణ్ నాయర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించి దాదాపు ఏడేండ్ల తర్వాత తిరిగి టీమ్‌ఇండియాకు ఎంపికైన కరణ్..డెయిలీ మెయిల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నాడు. 'నాకు ఇప్పటికీ గుర్తు. సరిగ్గా రెండేండ్ల క్రితం ఓ ప్రముఖ భారత క్రికెటర్ నన్ను రిటైర్ కావాలని సూచించాడు. తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడం కష్టమన్న అతను.. ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల్లో ఆడటం ద్వారా డబ్బులు సంపాదించవచ్చన్నాడు. కానీ ఆదాయం కోసం ఆలోచించలేదు. తిరిగి ఎలాగైనా భారత్‌కు ఆడాలన్న కసితో మళ్లీ దేశవాళీ బాటపట్టాను. నన్ను నేను నిరూపించుకుంటూ దేశవాళీ టోర్నీల్లో రాణించడం ద్వారా టెస్టు జట్టులోకి వచ్చాను' అని అన్నాడు.



## ఏఎఫ్‌సీ ఏషియన్ టోర్నీకి సౌమ్య

ముంబై: ఏఎఫ్‌సీ మహిళల ఏషియన్ కప్ ఆస్ట్రేలియా 2026 క్వాలిఫయర్స్ టోర్నీకి భారత జట్టును ఎంపిక చేశారు. సోమవారం 24 మందితో ప్రకటించిన భారత జట్టులో తెలంగాణ యువ ఫుట్‌బాలర్ గుగులోతు సౌమ్య చోటు దక్కించుకుంది. ఇటీవలే ఏఐఎఫ్‌ఎఫ్ అత్యుత్తమ ఫుట్‌బాలర్ అవార్డు అందుకున్న సౌమ్య.. టీమ్‌ఇండియాకు కీలకంగా వ్యవహరించనుంది. ఫార్వర్డ్‌గా సౌమ్య సేవలను ఉపయోగించేందుకు భారత ఫుట్‌బాల్ జట్టు సిద్ధమైంది. క్రిస్పిన్ ఛెత్రీ చీఫ్ కోచ్‌గా వ్యవహరించనుండగా, ప్రియ, నివేత రామాదాస్ సహాయక కోచ్‌లుగా ఎంపికయ్యారు.

**గంటకు 147కి.మీల వేగంతో బౌలింగ్**

# పేస్ సంచలనం ప్రణవ్

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*



భారత్ క్రికెట్‌లో మరో తురుపుముక్క! 17 ఏండ్ల వయసులోనే గంటకు 147 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించే బౌలర్ వెలుగులోకి వచ్చాడు. 'పిట్టకొంచెం కూత ఘనమ'న్నట్లు టీనేజ్‌లోనే అంచనాలకు మించి రాణిస్తున్నాడు. వాయువేగాన్ని తలపిస్తూ బ్యాటర్లకు సింహస్వప్నంలా నిలిచేలా ఆ కుర్రాడు వేసే బంతులకు అందరూ ఫిదా అవుతున్నారు. మెరుపు వేగానికి సూపర్ స్వింగ్‌ను జోడిస్తూ వికెట్ల వేట కొనసాగిస్తున్న ఆ యువ క్రికెటరే తమిళనాడుకు చెందిన ప్రణవ్ రాఘవేంద్ర. ఇంగ్లండ్‌తో టెస్టు, వన్డే సిరీస్‌లకు భారత అండర్-19 జట్టులో చోటు దక్కించుకున్న ప్రణవ్ ఇప్పుడు టాక్ ఆఫ్ ద టౌన్‌గా నిలువడంలో ఓ ఆసక్తికర కథ ఉంది. 'నేను డాక్టర్ అయ్యేవాణ్ని.. యాక్టర్‌ను అయ్యానంటూ' సినిమా ఇండస్ట్రీలో చాలా మంది పలు సందర్భాల్లో చెప్పిన నేపథ్యం మనకు గుర్తుండే ఉంటుంది. సరిగ్గా ఇప్పుడు ఇదే కోవలో అథ్లెట్‌గా ట్రాక్‌పై చిరుతను తలపించిన ప్రణవ్..ఫాస్ట్‌బౌలర్‌గా రూపాంతరం చెందాడు. ఓ డాక్టర్ ఇచ్చిన సలహా మేరకు వ్యక్తిగత ఈవెంట్ అయిన అథ్లెట్స్ కాకుండా టీమ్‌గేమ్ అయిన క్రికెట్‌లోకి ప్రణవ్ రంగప్రవేశం చేశాడు. అప్పటికే జరిగిన ఓ 100మీటర్ల స్ప్రింట్‌ను ప్రణవ్ 13.76సెకన్లలో పూర్తి చేసి ఔరా అనిపించుకున్నాడు. ప్రణవ్ అలాగే అథ్లెటిక్స్‌లో కొనసాగి ఉంటే భారత క్రికెట్ ఓ అద్భుత నైపుణ్యమున్న ఫాస్ట్‌బౌలర్‌ను కోల్పోయేది. తాను పరుగులో ఎంత వేగమో అదే దూకుడును బౌలింగ్‌లోనూ కొనసాగిస్తూ 16 ఏండ్ల వయసులోనే గంటకు 139కి.మీ మార్క్ అందుకుని ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ దృష్టిలో పడ్డాడు. ఇక్కడే ఈ యువ క్రికెటర్ కెరీర్ మలుపు తిరిగింది. మెక్‌గ్రాత్ మార్గనిర్దేశంలో చెన్నైలో నడిచే ఎమ్‌ఆర్‌ఎఫ్ పేస్ ఫౌండేషన్.. ప్రణవ్‌కు ఓనమాలు నేర్పింది. 'ప్రణవ్‌కు మంచి లైన్ అండ్ లెంగ్త్ ఉంది. నేను తొలిసారి అతన్ని చూసినప్పుడు గంటకు 130కి.మీల వేగంతో బంతులు వేశాడు. కానీ ఈ రెండేండ్ల వ్యవధిలో అతనిలో చాలా మార్పు వచ్చింది. వేగం అనేది అతనికి సహజంగా వచ్చింది. ఇప్పుడు ప్రణవ్ నిలకడగా 135 నుంచి 145కి.మీల వేగంతో బంతులు వేస్తున్నాడు. అతను ఇంకా నేర్చుకునే దశలో ఉన్నాడు. అతన్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. వేగంగా బౌలింగ్ చేయాలంటే ఫిట్‌నెస్ చాలా కీలకం' అని ఎమ్‌ఆర్‌ఎఫ్ పేస్ ఫౌండేషన్ చీఫ్ కోచ్ సెంథిల్‌నాథన్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన ప్రణవ్..బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తన సత్తాఏంటో చూపెట్టాడు. 17 ఏండ్ల వయసులో 147కి.మీల వేగంతో బంతులు వేసి భారత అండర్-19 జట్టులో చోటు దక్కించుకోగలిగాడు. కేవలం పేస్ వరకే పరిమితం కాదన్న ప్రణవ్ తన మనసులో మాట బయట పెట్టాడు. 'నాకు వేగమంటే ఇష్టం, బౌలింగ్ ఫాస్ట్‌గా చేసేందుకు ప్రయత్నిస్తా. మెరుపు వేగంతో బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తూ బౌన్సర్లు వేయడాన్ని బాగా ఇష్టపడుతా. బుల్లెట్‌లా దూసుకొచ్చే బంతి బ్యాటర్..గ్లౌవ్స్‌కు తాకుతూ ఔటయ్యే సందర్భం మాటల్లో వర్ణించలేనిది. కానీ దాని కోసం చాలా కష్టపడాలి. ముఖ్యంగా ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలి. సరైన విధంగా బౌలింగ్ చేయాలంటే అందుకు తగ్గట్లు స్కిల్‌సెట్‌తో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. అలాగైతేనే వచ్చే ఏడాది జరుగనున్న అండర్-19 ప్రపంచకప్‌లో చోటు దక్కించుకోగల్గుతా' అని ధీమాగా చెప్పుకొచ్చాడు. పేస్ పిచ్‌లకు స్వర్గధామమైన ఇంగ్లండ్‌లోనూ ప్రణవ్ ఇదే తరహాలో ఇరగదీస్తే అతనికి తిరుగుండకపోవచ్చు.

## నేడు జట్టుతో కలవనున్న గంభీర్



ఢిల్లీ: తల్లికి అనారోగ్యంతో ఇంగ్లండ్ నుంచి ఉన్నఫళంగా స్వదేశానికి వచ్చిన టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్.. మంగళవారం తిరిగి జట్టుతో కలవనున్నాడు. గంభీర్ తల్లి ఇటీవలే గుండెపోటుకు గురవగా ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగవుతుండటంతో అతడు మంగళవారం ఇంగ్లండ్‌కు బయల్దేరనున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గంభీర్ నేడు జట్టుతోనూ కలిసే అవకాశాలున్నట్టు సమాచారం.



*ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌కు నేటితో తెరలేవనుంది. బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య మంగళవారం గాలె వేదికగా మొదలుకాబోయే తొలి టెస్టుతో డబ్ల్యూటీసీ నాలుగో ఎడిషన్ ఆరంభమవనుంది.*

**చిత్రం**



**రజనీకాంత్ అతిథి పాత్రలో మోహన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'పెదరాయుడు' చిత్రం ఈ నెల 15తో ముప్పైఏళ్లు పూర్తిచేసుకుంది. ఈ నేపథ్యంలో ఇద్దరు నటులు కలుసుకొని నాటి జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మంచు విష్ణు తాజా చిత్రం 'కన్నప్ప'ను రజనీకాంత్ వీక్షించారు. సినిమా అద్భుతమని కొనియాడారు. ఈ విషయాన్ని మంచు విష్ణు తన సోషల్‌మీడియా ద్వారా పంచుకున్నారు. ఈ క్షణం కోసం తాను 22ఏళ్లుగా ఎదురుచూస్తున్నానని, రజనీకాంత్‌గారి ప్రశంసలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయని మంచు విష్ణు పేర్కొన్నారు.**

# రాజాసాబ్‌గా వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారు



ఆడియన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రెస్టేజియస్ పానిండియా హారర్ కామెడీ థ్రిల్లర్.. ప్రభాస్ 'ది రాజాసాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. మారుతి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 5న విడుదల కానుంది. సోమవారం హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'ప్రభాస్ నాతో సినిమా చేస్తున్నారనగానే చాలామందిలో ప్రశ్నలు తలెత్తాయి. వారందరికీ సరైన సమాధానమిస్తుందీ సినిమా. ప్రభాస్‌గారిని కలిసినప్పుడు ఆయన ఫస్ట్ నాతో అన్నమాట.. 'మీ ప్రేమకథా చిత్రమ్, భలేభలే మగాడివోయ్ సినిమాలంటే నాకిష్టం.. అలాంటి సినిమా చేద్దామా..' అని. అప్పుడే ఆయనకు ఓ లైన్ చెప్పా. ఆ తర్వాత గోపీచంద్‌తో నేను చేసిన 'పక్కా కమర్షియల్' సరిగ్గా ఆడకపోవడంతో.. పాన్ ఇండియా స్టూపర్‌స్టార్ అయిన ప్రభాస్‌తో ఈ టైమ్‌లో నేను సినిమా చేయడం కరెక్ట్ కాదనిపించింది. ఇంతలో ఆయనే ఫోన్ చేసి, 'అప్పుడు మీరు చెప్పిన కథలో ఈ పాయింట్స్ బావున్నాయి..' అంటూ చెప్పడం మొదలుపెట్టారు. ఆయనకి ఈ కథ అంత నచ్చినప్పుడు మనం మాత్రం ఎందుకు వెనకడుగేయాలి? అని చాలెంజ్‌గా తీసుకొని 'ది రాజాసాబ్' మొదలుపెట్టాను. 'మన ఫ్యాన్స్ వండర్‌ఫుల్ ఫ్యాన్స్ డార్లింగ్.. వాళ్లకు మంచి మూవీ ఇవ్వాలి' అని ప్రభాస్ అంటుంటారు. ఈ సారి 'బుజ్జిగాడి' స్టైల్ వింటేజ్ ప్రభాస్‌ని చూస్తారు. ఇంకా కొంత షూటింగ్, సాంగ్ బ్యాలెన్స్ ఉంది' అని పేర్కొన్నారు. తమ సంస్థలోనే ఇది బిగ్గెస్ట్ మూవీ అనీ, మేకింగ్ గ్రాండియర్‌గా ఉంటుందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. ఇంకా క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్, డీవోపీ కార్తీక్ పళని, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ కూడా మాట్లాడారు.



# మనం తర్వాత మరోసారి?

అఖిల్ అక్కినేని ప్రస్తుతం చేస్తున్న సినిమా 'లెనిన్'. ఈ సారి ఎలాగైనా హిట్ కొట్టి తీరాలనే కసితో ఆయన ఈ సినిమా చేస్తున్నారు. దానికి తగ్గట్టుగానే ఓ విభిన్నమైన కథను ఎంచుకున్నారాయన. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఇదిలావుంటే.. ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వినిపిస్తున్నది. ఈ సినిమాలో అక్కినేని నాగార్జున కూడా ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారట. ఇటీవలే విడుదలైన టీజర్ ఈ సినిమాపై అంచనాలు పెంచింది. ఇప్పుడు నాగ్ కూడా ఇందులో భాగం కానున్నారన్న వార్త రావడంతో సినిమాపై బజ్ రెట్టింపయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అక్కినేని ఫ్యామిలీ అంతా కలిసి నటించిన 'మనం' సినిమాతో తొలిసారి తెరపై కనిపించారు అఖిల్. క్లైమాక్స్‌లో వచ్చే ఆ సీన్‌లో నాగార్జున కూడా ఉంటారు. మళ్లీ ఇన్నాళ్లకు తండ్రితో కలిసి 'లెనిన్'లో అఖిల్ నటిస్తుండటం అక్కినేని అభిమానులకు నిజంగా శుభవార్తే. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# హనుమాన్ జంక్షన్ రీరిలీజ్




ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్నది. ప్రతి వారం ఏదో ఒక చిత్రం పునఃవిడుదలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నది. అదే వరుసలో ఇప్పుడు అర్జున్, జగపతి బాబు నటించిన 'హనుమాన్ జంక్షన్' (2001) చిత్రం ఈ నెల 28న మరలా ప్రేక్షకుల ముందుకురానుంది. మోహన్‌రాజా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వేణు, స్నేహ, లయ ప్రధాన పాత్రల్ని పోషించారు. కుటుంబ భావోద్వేగాలు, వినోదం సమపాళ్లలో కలబోసిన ఈ తరహా చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని, అందుకే రీరిలీజ్ చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఎం.ఎల్.మూవీ ఆర్ట్స్ పతాకంపై ఎం.వి.లక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మించారు.

## కావాలనే ప్రచారం చేశారు!



అందంతో పాటు చలాకీ నటనతో నాటి యువతరం కలల రాణిగా భాసిల్లింది జెనీలియా. వివాహానంతరం సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న జెనీలియా.. తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'లో కీలక పాత్రను పోషించింది. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుందీ చిత్రం. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దాదాపు 14 ఏళ్ల క్రితం వచ్చిన తన పెళ్లి పుకార్లపై స్పందించింది. నటుడు జాన్ అబ్రహంతో జెనీలియా పెళ్లి జరిగిందని, సెట్‌లోనే వారిద్దరు పెళ్లాడారని అప్పట్లో బాగా ప్రచారం జరిగింది. అయితే ఆ తర్వాత ఏడాదే బాలీవుడ్ హీరో, తన స్నేహితుడు రితేశ్ దేశ్‌ముఖ్‌తో వివాహ బంధంలోకి అడుగుపెట్టింది జెనీలియా. దాంతో ఆ పుకార్లకు చెక్ పడింది. కాగా అప్పటి వదంతులపై తాజా ఇంటర్వ్యూలో జెనీలియా మాట్లాడుతూ 'కొంతమంది కావాలనే ఆ వార్తలను సృష్టించారు. వారెవరో కూడా నాకు తెలుసు. సెట్‌లో అనుకోకుండా మా పెళ్లి జరిగిందని విస్తృతంగా ప్రచారం చేశారు. అలా ఎందుకు చేశారో ఇప్పటికీ అర్థం కాదు' అని సమాధానమిచ్చింది జెనీలియా.



## ఈసారి కుటుంబ కథలో..

గత కొన్నేళ్లుగా యాక్షన్, మాస్ సినిమాలు చేస్తున్న హీరో రవితేజ తాజాగా ఓ ఫ్యామిలీ కథలో నటిస్తున్న విషయం తెలిసిందే. కిషోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైంది. ఆర్‌టీ76 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం సోమవారం సెట్స్‌పైకి వెళ్లింది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో రవితేజతో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రవితేజ శైలి కామెడీ, మాస్ అప్పీల్ కలబోసిన చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని, ఈ సినిమా కోసం ఆయన సరికొత్త మేకోవర్‌తో సిద్ధమయ్యారని చిత్రబృందం పేర్కొంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణ సంస్థ: ఎల్ఎల్‌వీ సినిమాస్, రచన-దర్శకత్వం: కిషోర్ తిరుమల.



## అతనిలో అన్నీ ఇష్టమే!

నిప్పు లేనిదే పొగరాదు.. మౌనం అర్ధ అంగీకారం.. ఈ ఉవాచలు విజయ్ దేవరకొండ, రష్మికలకు సరిగ్గా సరిపోతాయి. వెకేషన్స్ అంటూ విదేశాలకు చెందిన లొకేషన్లలో వీళ్ల ఫొటోలు విడివిడిగా సోషల్ మీడియాలో దర్శనమిస్తుంటాయి. కానీ కలిసి వెళ్లినట్టు మాత్రం ఎక్కడా కనిపించరు. ప్రేమ, పెళ్లి ప్రస్తావన తెస్తే ఇద్దరూ నర్మగర్భంగానే సమాధానాలిస్తుంటారు. అంతేతప్ప ఇద్దరి మధ్య అనుబంధం ఉందనిగానీ, లేదని గానీ చెప్పరు. ఇరు కుటుంబాల మధ్య రాకపోకలు బాగుంటాయి. సత్సంబంధాలూ కూడా గట్టిగానే ఉంటాయి. కానీ పెళ్లి గురించి మాత్రం నోరు మెదపరు. వీటిని బట్టి ఏం అర్థం చేసుకోవాలో తెలియక సమమతమైపోతుంటారు అభిమానులు. అయితే.. ఆదివారం జరిగిన 'కుబేర' వేడుకలో యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ అనుకోకుండా రష్మిక ఓపెనైంది. దీంతో క్లారిటీ ఇచ్చేసిందంటూ చంకలు గుద్దుకుంటున్నారు నెటిజన్లు. వివరాల్లోకెళ్తే.. 'కుబేర' వేడుకలో సుమ అక్కడున్న సెలబ్రిటీలను కొన్ని ర్యాండమ్ క్వశ్చన్స్ అడిగింది. ఈ క్రమంలో రష్మికకు కొందరు హీరోల పేర్లు చెప్పి, వీరిలో నచ్చిన అంశాలేంటి? అనడిగితే.. నాగార్జున, ధనుష్, బన్నీల గురించి తన అభిప్రాయాలను వ్యక్తం చేసింది రష్మిక. చివరిగా సుమ అడగాల్సిన పేరునే అడిగేసింది. అదే.. 'విజయ్ దేవరకొండ'. ఆ పేరు వినగానే రష్మిక అందంగా నవ్వుతూ.. 'తనలో అన్నీ ఇష్టమే.. ఎవ్రీథింగ్..' అంటూ 'తనంతా నాకే కావాలి..' అన్నట్టు సమాధానమిచ్చింది. దాంతో అభిమానుల కేరింతలతో ఆడిటోరియం దద్దరిల్లిపోయింది.

# యూనిక్ కాన్సెప్ట్‌తో సుహాస్ సినిమా



**కలర్‌ఫొటో**, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ వంటి చిత్రాలతో హీరోగా మంచి పేరు సాధించిన నటుడు సుహాస్ కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందుతున్నది. శివాని నగరం కథానాయిక. డెబ్యూ డైరెక్టర్ గోపి అచ్చర దర్శకత్వంలో బి.నరేంద్రరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి హీరో సత్యదేవ్ కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర దర్శకుడు నాగ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. వంశీ నందిపాటి ఫస్ట్ షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు. ఇందులో సుహాస్ పాత్ర వైవిధ్యంగా ఉంటుందని, యూనిక్ కాన్సెప్ట్‌తో అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నామని మేకర్స్ తెలిపారు. నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రచన: షణ్ముఖ ప్రశాంత్, కెమెరా: మహిరెడ్డి పండుగల, నిర్మాణం: త్రిశూల్ విజనరీ స్టూడియోస్.



## తెలుగులో నాయికగా అరంగేట్రం

తమిళంలో కథానాయికగా మంచి పేరు తెచ్చుకుంది అమ్ము అభిరామి. రాక్షసన్, అసురన్ వంటి చిత్రాల్లో ఆమె నటన మెప్పించింది. తాజాగా ఈ భామ రాజ్‌తరుణ్ జోడీగా తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రఫ్‌నోట్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. 'సక్సెస్‌ఫుల్ గోలీసోడా ఫ్రాంచైజీలో భాగంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అమ్ము అభిరామి పాత్ర భావోద్వేగభరితంగా సాగుతుంది. కథాగమనంలో ఆమె పాత్ర కీలకంగా ఉంటుంది. తెలుగులో అమ్ము అభిరామికు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుంది' అని దర్శకుడు విజయ్ మిల్టన్ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.